



PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్






నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjunsaamaachaaram.com | మంగళవారం 16, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 169 | పేజీలు : 8 , వెల.2.00


### అమెరికా-ఇరాన్ శాంతి

# ఒప్పందం.. స్వాగతించిన ప్రధాని మోదీ..



2 లో..

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు.'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుంది.




# మోదీ హామీల లెక్క తేల్చండి..

- ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి
- మోదీ ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలి
- మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..
- మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా?
- మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..
- కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదు
- కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారు..
- సీఎం రేవంత్‌రెడ్డి

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు.**

(సోమవారం) సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

2 లో..





## వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని

సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి పిల్లలను కాపాడేందుకు యూకే ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి యూకేలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తాజాగా తెలిపారు. ఈ ఏడాది చివరి కల్లా ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అమల్లోకి తెస్తామని అన్నారు.

2

### ఇందిరాగాంధీ బతికుంటే బీజేపీని

# నిషేధించేవారు: అశోక్ గహ్లోత్

దేశ రాజకీయాల్లో సరికొత్త వివాదం చెలరేగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ గనుక ఇప్పుడు బతికుంటే బీజేపీ లాంటి పార్టీని ఎప్పుడో నిషేధించేవారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీకి హిందువులన్నా, హిందుత్వ అన్నా తీవ్ర ద్వేషమని మండిపడింది.

2






## గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసు ఛేదించిన పోలీసులు

వార్త 2లో

### ధాన్యం కొనుగోలులో తెలంగాణపై

# కేంద్రం వివక్ష: మంత్రి తుమ్మల ధ్వజం

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర (మీఎ్రా), ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పు కుంటోందని ఆయన ధ్వజమెత్తారు.



2



2

## ట్రంప్ డీల్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు : ఇజ్రాయెల్ మంత్రి

### తెలంగాణ వచ్చినా

# సింగరేణిలో పరిస్థితి మారలేదు: కవిత



2

మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు.

### ఎస్ఐఆర్ పై కాంగ్రెస్, బిఆర్ఎస్

# అనవసర విమర్శలు : రామచంద్రరావు

హైదరాబాద్:

దొంగ ఓట్లు నమోదు చేయడంలో కాంగ్రెస్ ఎక్స్ పర్ట్ అని టిబిజెపి చీఫ్ రామచంద్రరావు ఆరోపించారు. ఓట్ చోరీ చేసిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్లను తొలగించడానికే ఎస్ఐఆర్ ఉందని తెలియజేశారు. బంగ్లాదేశీయులు, రొహింగ్యాలను ఓటరు లిస్టు నుంచి తొలగించ వద్దా? రొహింగ్యాలకు హైదరాబాద్ లో ఓటు హక్కు ఇద్దామా? అని రామచంద్రరావు ప్రశ్నించారు. ఎస్ఐఆర్ పై కాంగ్రెస్, బిఆర్ఎస్ అనవసర విమర్శలు చేస్తున్నారని, రాజ్యాంగాన్ని కాంగ్రెస్ చోరీ చేసిందని మండిపడ్డారు. కేరళ లో కూడా ఎస్ఐఆర్ జరిగిందని ..అక్కడ కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. దేశంలో ఇప్పటి వరకు 12 సార్లు ఎస్ఐఆర్ జరిగిందని రాంచంద్రరావు పేర్కొన్నారు.





2

## ప్రభుత్వబడుల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన పొన్నం ప్రభాకర్

అర్జున్ సమాచారమ్

# మోదీ హామీల లెక్క తేల్చండి..

**ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి**

**మోదీ ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలి**

**మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..**

**మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా?**

**మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..**

**కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదు**

**కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారు..**

**సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని



చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

## మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. చీూజ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు

## మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..

రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం చీూజ అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి చీూజ ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు. కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

## కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..

కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేం ద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచిం చారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం.. స్వాగతించిన ప్రధాని మోదీ..

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు.'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుంది. సుస్థిరమైన తుది ఒప్పందం కుదిరేలా.. మిగిలిన అంశాలపై కూడా సానుకూల చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని మోదీ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేలా శాంతి ఒప్పందం ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు యుద్ధ చర్యలను నిలిపివేసి, ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరవడానికి అంగీకరించాయి. దీనివల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పట్టాయి.

# వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి పిల్లలను కాపాడేందుకు యూకే ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి యూకేలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తాజాగా తెలిపారు. ఈ ఏడాది చివరి కల్లా ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అమల్లోకి తెస్తామని అన్నారు. ఆన్‌లైన్ ప్రపంచం తాలూకు చెడు ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడుకునేందుకు గట్టి రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 'పూర్తిస్థాయి నిషేధమే సబబని నాకు అనిపిస్తోంది. దీన్ని అమలు చేయడం చాలా కష్టం. కానీ టెక్ కంపెనీ ఒత్తిడిని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే' అని ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనల పూర్తిస్థాయి అమలుకు తాను సిద్ధమేనని పేర్కొన్నారు. పిల్లల భద్రత, ఆనందం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పిల్లలకు ఆన్‌లైన్ ప్రపంచం నుంచి రక్షణ కల్పించడమే ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబాల పక్షాన నిలవాల్సిన సమయం ఇదేనని అభిప్రాయపడ్డారు. యథాతథ స్థితితో ఎలాంటి ప్రయోజనం కలగట్లేదని తాము గుర్తించినట్టు చెప్పారు. ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఈ తరహా నిషేధం అమలవుతోంది. సోషల్ మీడియాపై ఆంక్షలకు ఇండోనేషియా కూడా సిద్ధమైంది. పిల్లల సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బ్రెజిల్‌లో ఇప్పటికే పలు రకాల ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పిల్లలకు సోషల్ మీడియా నిషేధానికి ఫ్రాన్స్ కూడా సిద్ధమైంది. తుర్కియే చర్యలు తుదిదశలో ఉన్నాయి. ఇతర పాశ్చాత్య దేశాలు కూడా ఇదే బాటలో అడుగులు వేస్తున్నాయి. అయితే, తాను తీసుకునే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని బ్రిటన్ ప్రధాని చెప్పారు. ఈ విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తామని అన్నారు.

# ట్రంప్ డీల్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు : ఇజ్రాయెల్ మంత్రి

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

యూఎస్-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇతమార్ బెన్-గ్విర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందానికి ఇజ్రాయెల్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. ఇజ్రాయెల్ ఒక సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంత రాజ్యం కాదని తేల్చి చెప్పారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో తమకు గతంలో ఎదురైన గుణపాఠాల ఆధారంగా ఈ డీల్ విషయంలో స్పందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.'ట్రంప్ ఒప్పందానికి మేము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. మేము యూఎస్‌కు సామంత రాజ్యం కాదు.. ఇజ్రాయెల్ ఒక సార్వభౌమదేశం. అయితే, మేము స్పష్టంగా చెప్పదలుచుకున్నది ఏంటంటే.. యూఎస్ఏ అంటే మాకెంతో గౌరవం, అధ్యక్షుడు ట్రంప్‌కు ఎంతో రుణపడి ఉన్నాము' అని బెన్-గ్విర్ అన్నారు. వ్యవహారాల్లో ఇతర దేశాల ఒత్తిడికి లొంగిపోయి చివరకు రక్తంతో మూల్యం చెల్లించుకున్నామని అన్నారు. ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నామని చెప్పారు. ఓస్లో అకార్డ్స్, 2006 లెబనాన్ ఒప్పందం, గాజాలో ఎదురైన పరిస్థితులను కూడా మంత్రి ప్రస్తావించారు. ఆ అనుభవంతోనే యూఎస్ ఇరాన్ డీల్‌ను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. తాజాగా కుదిరిన శాంతి ఒప్పందం ప్రకారం, అన్ని రకాల మిలిటరీ చర్యలకు తక్షణం ఫుల్ స్టాప్ పెట్టాలని అమెరికా, ఇరాను లు అంగీకరించాయి. లెబనాన్ సహా తమ మిత్రపక్షాలెవరిపైనా ఎలాంటి దాడులు జరగకూడదని ఇరాన్ షరతు విధించింది. ఇందుకు యూఎస్ అంగీకరించింది. అయితే, డీల్‌కు కొన్ని గంటల ముందు కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులకు దిగింది. దీంతో, ఒప్పందం కుప్పకూలే స్థితి వచ్చిందని అన్నారు. చివరకు కొన్ని గంటల ఆలస్యంగా డీల్ ఖరారైందని చెప్పారు.

# ధాన్యం కొనుగోలులో తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి తుమ్మల ధ్వజం

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర (మీూ), ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు.

# ఇందిరాగాంధీ బతికుంటే బీజేపీని నిషేధించేవారు: అశోక్ గహ్లోత్

జైపూర్/న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

దేశ రాజకీయాల్లో సరికొత్త వివాదం చెలరేగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ గనుక ఇప్పుడు బతికుంటే బీజేపీ లాంటి పార్టీని ఎప్పుడో నిషేధించేవారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీకి హిందువులన్నా, హిందుత్వ అన్నా తీవ్ర ద్వేషమని మండిపడింది. జైపూర్‌లో జరిగిన ఒక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అశోక్ గహ్లోత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఉన్న వాతావరణంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తన 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇలాంటి 'అత్యంత ప్రమాదకరమైన' వాతావరణాన్ని ఎప్పుడూ చూడలేదని ఆయన పేర్కొన్నారు.'నేను పూర్తి బాధ్యతతో ఈ మాట చెబుతున్నాను.. దేశంలో ప్రస్తుత వాతావరణం తీవ్ర ఆందోళనకరంగా ఉంది. దేశ ప్రజలు ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు అనుభవించాల్సి వస్తుంది. అధికారంలో ఉన్నవారు ఉద్దేశపూర్వకంగా మతపరమైన ధ్రువీకరణకు పాల్పడుతున్నారు' అని అశోక్ గహ్లోత్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా సీటు ఇవ్వకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. 'దేశ ప్రజలకు చూపించడానికైనా కనీసం ఒక ఐదు సీట్లు ఇవ్వాల్సింది. కానీ తాము కేవలం 'ప్యూర్ హిందుత్వ పార్టీ' అని ప్రొజెక్ట్ చేసుకోవడమే వారి ఉద్దేశం. కేవలం హిందుత్వ మద్దతుదారులను రెచ్చగొట్టి పాలించాలనేదే వారి ఆలోచన. ఇందిరాగాంధీ లాంటి మహోన్నత నాయకురాలు నేడు బతికుంటే ఇలాంటి పార్టీపై నిషేధం విధించేవారు. కేవలం హిందువుల పేరుతోనే రాజకీయం చేయాలనుకుంటున్నారా?' అని ఆయన నిలదీశారు.

### కాంగ్రెస్‌కు హిందువులంటే ద్వేషం: బీజేపీ కౌంటర్

అశోక్ గహ్లోత్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి హిందువులు, హిందుత్వంపై ఉన్న ద్వేషాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హిందుత్వం అనేది ఒక జీవన విధానం. మరి దానిని ఇందిరాగాంధీ ఎందుకు నిషేధిస్తారు?' అని పూనావాలా ప్రశ్నించారు. అశోక్ గహ్లోత్ వ్యాఖ్యల్లో కాంగ్రెస్ నాయకుల 'ఎమర్జెన్సీ మైండ్‌సెట్' కనిపిస్తోందని విమర్శించారు.'కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లా లేదు.. అది ఒక 'ఇండియన్ నేషనల్ ఖిలాఫత్' లా మారిపోయింది. అందుకే వారు దేశ వనరులపై మొదటి హక్కు ముస్లింలదే అంటారు. కాంగ్రెస్‌కు ముస్లింలు కావాలి, కానీ ఎవరైనా హిందూత్వం గురించి మాట్లాడితే మాత్రం వారిని పాపాత్ములుగా చూస్తూ చర్యలు తీసుకోవాలని మాట్లాడుతున్నారు.' అని పూనావాలా మండిపడ్డారు.

# గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసు ఛేదించిన పోలీసులు

హైదరాబాద్,

నగరంలోని గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసును పాతబస్తీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడితో సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ప్రేమ వివాహమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. 2025, జనవరిలో రుక్సార్ బేగంను మసూద్ చాంది ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ వివాహాన్ని రుక్సార్ సోదరుడు జాహెద్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో వారితో అతడు తరచూ ఘర్షణకు దిగేవాడు. జూన్ 12వ తేదీన సోదరి నివాసానికి తన బంధువులతో కలిసి వెళ్లి మసూద్‌పై జాహెద్ దాడి చేశాడు. ఇనుప రాడ్లు, కత్తులతో బలంగా దాడి చేయడంతో మసూద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ దాడిని మసూద్ తండ్రి షేక్ ఇస్మాయిల్ అడ్డుకోబోయారు. దాంతో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ హత్యపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణ వచ్చినా సింగరేణిలో పరిస్థితి మారలేదు: కవిత

మంచిర్యాల, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా హరీశ్ రావు మాయలో పడ్డారన్నారు. హరీశ్‌రావు లేఖ రాయగానే.. కిషన్‌రెడ్డి వెంటనే మరో లేఖ రాశారని తెలిపారు. తెలంగాణలో ఓపెన్ కాస్టలతో సమానంగా అండర్ గ్రౌండ్స్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సింగరేణిలో పరిస్థితి మారలేదని కవిత వ్యాఖ్యానించారు. కార్మికులపై అత్యంత కర్కశంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని.. ప్రశ్నించే కార్మికులను అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. దీనంతటికీ కారణం ప్రభుత్వ అలసత్వమే అని మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటించారని.. కానీ కార్మికుల సమస్యలను తెలుసుకోలేదన్నారు. భట్టి విక్రమార్క పర్సంటేజ్‌లు తీసుకోవడం మానేయాలని.. ఆ తర్వాతే ప్రతిపక్షాలపై విమర్శలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 2012లో బొగ్గు స్కామ్ చేసిందని టీఆర్ఎస్ చీఫ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. సింగరేణి కూడా వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణ బ్లాక్‌లను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆదాయ పన్ను సమస్యను పరిష్కారం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్రంలోకి వస్తేనే ఐటీ సమస్య పరిష్కారం చేస్తామని కిషన్ రెడ్డి అంటున్నారని.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, సింగరేణిలోనూ గెలిచే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు అంశంలో మాకు క్లారిటీ ఉంది. కొత్త పార్టీపై ఫిర్యాదులు చేస్తున్నారంటే.. మేం బలంగా ఉన్నట్టే కదా' అంటూ కవిత పేర్కొన్నారు.

# ప్రభుత్వబడుల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన పొన్నం ప్రభాకర్

హైదరాబాద్:

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. ఇవాళ్టి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేశారు. రాజ్ భవన్ బడిలో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. తొలిరోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బక్స్ పంపిణీకి ఏర్పాట్లు చేశారు. పాఠశాలల్లో టీచర్లు, సిబ్బంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇంటర్, పాఠశాల విద్యార్థులకు కలిపి 1.44 లక్షల మందికి పైగా ప్రయోజనం ఉంటుంది.




# కొండవీటి వాగు.. పాల వాగులపై 69 వంతెనల నిర్మాణం

## వర్షాకాలం దృష్ట్యా శరవేగంగా పనుల నిర్మాణం పూర్తికి చర్యలు

### నిర్మాణాలను పూరిశీలించిన మంత్రి నారాయణ

### జగన్ విమర్శలను మరోమారు తిప్పికొట్టిన మంత్రి



**అమరావతి,**

అమరావతిలో కొండవీటి వాగు.. పాల వాగులపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. అమరావతిలో మంత్రి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. అమరావతిలో 69 వంతెనల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంతెనల వద్ద మట్టి, తాత్కాలిక కట్టలు తొలగించాలని అధికారులకు సూచించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువల పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే జేసీబీలతో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి ఎక్కువశాతం వంతెనల పనులు పూర్తి కానున్నాయని మంత్రి నారాయణ వివరించారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అమరావతి హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రాజెక్టుల కంటే తక్కువని స్పష్టం చేశారు. హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,393 మాత్రమే ఖర్చు అవుతోందని వివరించారు. కేంద్ర నివాస సముదాయాల వ్యయం చదరపు అడుగుకు రూ.3,945 ఖర్చు చేస్తున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల నివాసాల కోసం రూ.1003 కోట్లతో టెండర్ వేయగా చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌కి రూ.1234 కోట్లతో టెండర్ వేయగా, చదరపు అడుగుకు రూ3,945 ఖర్చు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రాజధాని అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ ఆధ్వర్యంలో వాగులపై 43 వంతెనలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 వంతెనలు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత అయినా ప్రతిపక్ష నేత అమరావతి నిర్మాణాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రాజధాని అమరావతి పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ రెండు వాగులపై జరుగుతున్న వంతెనల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమరావతిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ రెండు వాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ఇంజనీరింగ్ ప్రణాళికలతో పనులు వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి భవనాల నిర్మాణ వ్యయంపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 3,945 ఖర్చు అవుతుంటే, అమరావతి హ్యాపీనెస్ట్ నిర్మాణానికి రూ. 3,393, గెజిటెడ్ అధికారుల నివాసాలకు రూ. 3,684 మాత్రమే వ్యయం అవుతోందని తెలిపారు. ఐకానిక్ భవనాలు కావడం వల్లే కొన్నింటికి కొద్దిగా ఖర్చు ఎక్కువ అవుతుందని, పార్లమెంట్ భవనానికైనా, తెలంగాణ సచివాలయం నిర్మాణానికైనా తొలిసారి పిలిచిన టెండర్లుకి.. పూర్తయ్యేనాటికి భారీగా ఖర్చయిందని.. ఖర్చు పెరగడం సహజమేనని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానకపోతే వచ్చే ఎన్నికల్లో వారికి 11 సీట్లు కూడా రావంటూ ఘాటుగా ఎద్దేవా చేశారు.

# జగన్, షర్మిల శవ రాజకీయాలు మానుకోవాలి

## బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విమర్శలు

**విజయవాడ,**

జగన్, షర్మిల శవ రాజకీయాలు మానుకోవాలని బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు విస్తృతమైన కార్యాచరణను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. తిరుపతి వేదికగా జరగబోయే భారీ ఎన్డీఏ సభలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, బీజేపీ అగ్రనేతలు పాల్గొని కూటమి భవిష్యత్తు ప్రణాళికను వివరించనున్నారని తెలిపారు. 12 ఏళ్ల మోదీ పాలనలో దేశం సాధించిన ప్రగతిని, ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని, 2047 నాటికి 'వికసిత్ భారత్, వికసిత్ ఏపీ' లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఇటీవల విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ఐరన్ ఓర్ ప్రమాదంలో కార్మికులు మరణించడం అత్యంత బాధాకరమని పీవీఎన్ మాధవ్ అన్నారు. జగన్ అక్కడకు వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. శవాలను అడ్డం పెట్టుకుని జగన్ రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, అది ప్రైవేటు పరం కాకుండా ఆపింది తామేనని స్పష్టం చేశారు. 'స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటు పరం కాకుండా నేనే చేశాను అని జగన్ ఎలా చెప్పుకుంటారు?' అని ప్రశ్నించారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,**

తెలంగాణ ఇంటర్ బోర్డు.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలపై విద్యార్థులకు కీలక అప్‌డేట్ ఇచ్చింది. తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇంటర్ మొదటి, రెండో సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల మార్కుల మెమోలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది. విద్యార్థులు తమ ఫలితాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా చెక్ చేసుకోవచ్చు. మే 13 నుంచి 21 వరకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 889 పరీక్షా కేంద్రాలలో 3,98,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలలో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తిచేసిన బోర్డు.. సకాలంలో ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఉపయోగించి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తమ మార్క్స్ మెమోను సులువుగా చెక్ చేసుకోవచ్చు.

# ప్రేమజంట కనిపిస్తే బెదిరించి దోపిడీ

## ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హన్మకొండ,**


ఏకాంతంగా ఉన్న లవర్సే వారి టా÷-గ్గ్÷ట్. ఎక్కడైనా ఒంటరిగా ప్రేమ జంట కనిపిస్తే చాలు దోపిడీలకు పాల్పడుతుంటారు. ప్రేమ జంటలను బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేటకు చెందిన బౌరి పవన్ సింగ్, రవీందర్ సింగ్, సికిందర్ సింగ్ ముగ్గురు కలిసి ఈ నెల 7న ఉర్సు గుట్ట ప్రాంతంలో ఓ యువతి, యువకుడు బైక్‌పై వెళ్లడాన్ని గమనించారు. వారు ఏకాంతంగా గడుపుతుండా సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి డబ్బులు ఇవ్వకుంటే మీ తల్లిదండ్రులకు చెబుతామని బెదిరించారు. తమ దగ్గర డబ్బులు లేవని బతిమాలిన వినకుండా సదరు జంటపై దాడికి పాల్పడి చేతికి ఉన్న బంగారు ఉంగరాలు, గొలుసులు లాక్కున్నారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. కాగా, వారి వద్ద దోచుకున్న సొత్తును విక్రయించేందుకు వరంగల్ వెళ్లగా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు ఉంగరం, గొలుసులు, మూడు సెల్‌ఫోన్స్, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ స్వామి తెలిపారు.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

## నీళ్లు లేక 49మంది మృత్యువాత

**సహారా**

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు.



విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# కొనసాగుతున్న ఎండల తీవ్రత

## పలు జిల్లాల్లో గతేడాది కన్నా మిన్నగా ఉష్ణోగ్రతలు





**హైదరాబాద్,**

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. రుతపవనాలు జాడ ఇంకాలేదు. ఈ క్రమంలో అనేక జిల్లాల్లో ఎండల తీవ్రత పెరిగింది. నిరుటితో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి ప్రతాపంతో నిప్పుల కుంపటిగా ఉన్న రాష్ట్రం ఒక్కసారిగా వాతావరణం సాయంత్రం మారింది. ఆదిలాబాద్ జిల్లా రైతులు మార్కెట్ యార్డులో పోసిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పదిరోజుల్లో ప్రవేశించనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రుతుపవనాలు జూన్ 10 నుంచి 12 తేదీల మధ్య రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నది. వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాలు రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్టు వెల్లడించింది. వచ్చే నాలుగు రోజులు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని స్పష్టం చేశారు.

# వడదెబ్బతో భూపాలపల్లిలో నలుగురు మృతి

తెలంగాణలో ఎండలు రోజురోజుకీ మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పులకొలిమిలా మారింది. భూపాలపల్లిలో వడదెబ్బతో ఒక్కరోజే నలుగురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. రేగొండ మండలం భాగిర్తిపేటకు చెందిన యాకూబ్(45), మొగుళ్లపల్లి మండలం పోతుగల్లుకు చెందిన సక్కమ్మ(59), చిట్యాల మండలం చల్లగరిగేకు చెందిన పోషయ్య, కాటారం మండలం శంకరంపల్లికి చెందిన సమ్మక్క(65) వడదెబ్బ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఒక్కరోజే 22 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొమ్మిది మంది వడదెబ్బ బారినపడి మరణించడం ఆందోళన కలిగిస్తోంది. భానుడి భగభగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ మరణాలు కూడా పెరుగుతున్నాయి. తీవ్రమైన ఎండలతో చిన్నపిల్లలు, వృద్ధులు, బయట పనులు చేసే కార్మికులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

# ముమ్ముందు వర్షాభావ పరిస్థితులు

## నీటిని పొదుపుగా వాడుకోవాలన్న మంత్రి

**రాజమహేంద్రవరం,**

వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముందుగానే నాట్లు వేసుకొని పంటలను రక్షించుకోవాలని రైతులకు మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు. ముందస్తు నీటి విడుదలతో త్వరగా పంట చేతికి వస్తోందని, దీంతో నష్టాల బారి నుంచి రైతు గట్టెక్కవచ్చాన్నారు. నీటిని పొదుపుగా వాడుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి ఖరీఫ్ సీజన్ సాగునీటిని విడుదల చేసినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డ ం సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతులకు మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఇదిలావుంటే దుక్కి దున్నడం నుంచి పంట విక్రయం వరకు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చుతున్న అన్నదాతలకు ఆదాయం అంతంతమాత్రంగానే వస్తోంది. సాగులో తెగుళ్లు, వడగళ్ల వానలు నష్టం మిగల్చగా వరి కోతలతో రైతులకు ఆర్థిక మోత పడుతోంది. ధాన్యాన్ని కల్లాల కు, కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు, ఇళ్లలోకి తరలించడానికి రవాణా ఛార్జీలు సైతం తడిసి మోపెడవుతున్నాయి. ఇంధనం ధరల హెచ్చు తగ్గులను సాకుగా చూపుతూ యంత్రాలు, ట్రాక్టర్ల యజమానులు అద్దె ధరలను పెంచేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీలో ఎకరానికి పెట్టుబడిగా రూ.40 నుంచి రూ.45 వేలు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

# విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

## తొలిసారిగా ఏర్పాటు చేసిన ఎపి ప్రభుత్వం

## లాంఛనంగా ప్రారంభించిన హోంమంత్రి అనిత

**విశాఖపట్నం,**


: విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారిగా హోంగార్డులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. సుమారు రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్‌ను పొందవచ్చు. హోం మంత్రి అనిత ప్రోత్సాహంతో మొదటి విడతగా 975 మంది హోంగార్డులకు ఆరోగ్య బీమాను అందించనున్నారు. ఈ బీమా పథకం కింద భర్త, భార్య, ఇద్దరు పిల్లల వరకు కవరేజ్ ఉంటుంది. ఈ సందర్భంగా హోం మినిస్టర్ అనిత మాట్లాడుతూ.. పోలీసు వారికి వర్తించే ఆరోగ్య భద్రత.. హోంగార్డులకు వర్తించకపోవడం, వారి వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రూ.3 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. దీని ద్వారా సుమారు 3,140 మంది లబ్ది పొందనున్నారని తెలిపారు. హోంగార్డుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తి ఉచితంగా ఈ బీమా సదుపాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. విధుల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు తిరిగి ఉద్యోగం కల్పించే పరిస్థితి లేనందున.. ఆ కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా ఈ ఆరోగ్య బీమా ఎంతో సహాయపడుతుందని హోం మంత్రి అనిత వివరించారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# చదువు 'కొనడం' ఎంతభారం!

ఈనెల 15 నుంచి స్కూళ్లు తెరుస్తుండడం విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. స్కూళ్ల ఫీజులకు, ఇతర అవసరాలకు, రవాణాకు ఎంత ఖర్చు పెట్టవలసి వస్తోందో అని తర్జనభర్జన పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 14 వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. టెన్త్‌వరకు చదివే విద్యార్థులు 24 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో 74% మంది ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో 60% మంది విద్యార్థులు ఉండగా, వీరిలో సగానికి పైగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారే ఉన్నారు. అయితే ఈ కుటుంబాల ఆదాయం నెలకు రూ. 30 వేలు నుంచి రూ. 50 వేల లోపే ఉంటోంది. ఈ పరిస్థితుల్లో కొన్ని లక్షలు వెచ్చించి తమ పిల్లలను ఎలా చదివించుకోగలుగుతారు? ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వసూలు విషయానికి వస్తే దేశంలో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు ఛైర్మన్‌గా కమిటీని వేసింది. ఆ కమిటీ 10% లోపు ఫీజులను యాజమాన్యాలు పెంచుకోవచ్చని, 15% కంటే ఎక్కువ అయితే ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంటుందని ప్రతిపాదించింది. స్కూల్ విధానమే ప్రత్యామ్నాయం! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజుల నియంత్రణ అంశంపై 2024 జులైలో మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. తెలంగాణ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మోనిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు2025ను ప్రభుత్వానికి సమర్పించడమైంది. రెండేళ్లకోసారి 8% ఫీజులను పెంచుకోవడానికి స్కూల్ యాజమాన్యాలకు అనుమతి ఉండాలని, 9% కంటే ఎక్కువగా ఫీజులను పెంచుకోవాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని ప్రతిపాదించింది. ఫీజుల నియంత్రణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని, నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతోపాటు సంబంధిత సొమ్మును విద్యాసంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు అది కార్యాచరణ లోకి రాలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం సాధారణ స్కూళ్లలో ఐదో తరగతి చదివే విద్యార్థికి గత ఏడాది రూ. 70 వేలు వరకు వార్షిక ఫీజు చెల్లించగా, ఈ ఏడాది నుంచి రూ. 1.10 లక్షల వరకు చెల్లించవలసి వస్తుంది. కార్పొరేట్ స్కూళ్లలో ఏకంగా రూ. 2.75 లక్షలున్న ఫీజును రూ. 3.50 లక్షలకు పెంచారు. ఒక మాదిరి స్కూలులో కూడా రూ. లక్షవరకు ఫీజులు



పిండుతున్నారు. వేతనాలు పెరగడం, ఏఐ విద్య కల్పించడం, లేబొరేటరీ, మౌలిక వసతుల ఖర్చులు పెరగడం వీటన్నిటి వల్ల ఫీజులు పెంచవలసి వస్తోందని యాజమాన్యాలు నచ్చచెబుతున్నాయి. విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లి తిరిగి ఇళ్లకు చేర్చడానికి స్కూలు బస్సులు, ఆటోల రేట్లు కూడా పెరిగాయి. కిలోమీటరు దూరానికి కనీస ఛార్జీగా నెలకు రూ. 15 వేలు వెచ్చించక తప్పదని అంటున్నారు. గత ఏడాది ఈ ఛార్జీ రూ. 10 వేలు వరకు ఉండేది. స్కూలు బస్సుల ఛార్జీలు 30 నుంచి 60 శాతం వరకు పెంచారు. అమెరికాఇరాన్ యుద్ధప్రభావంతో డీజిల్ రేట్లు పెరిగాయని అందుకే రవాణా ఛార్జీలు కూడా పెంచవలసివస్తోందని స్కూళ్ల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఇక స్కూళ్లలో విక్రయించే నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్ తప్పనిసరిగా ఎక్కువ ధరలకు కొనుగోలు చేయవలసివస్తోంది. ఏఐ సంబంధిత పాఠాల కోసం కొన్ని ఎలెక్ట్రానిక్ గ్యాడ్జెట్లు అంటగడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. రెండో తరగతి విద్యార్థికైనా ఏఐ విద్య అవసరమని స్కూళ్ల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఈమేరకు గత ఏడాది రూ. 90 వేలు ఫీజు ఉంటే ఈ ఏడాది ఏకంగా రూ. 1.30 లక్షలు కట్టమంటున్నారని, ఈ విద్యకోసం కొన్ని సాఫ్ట్‌వేర్ గ్యాడ్జెట్లు కొనిపించారని దానికి రూ. 12 వేలు వసూలు చేశారని హైదరాబాద్‌కు చెందిన కుటుంబీకులు పేర్కొన్నారు. ఇన్ని విధాలుగా ఖర్చులు భరించాలంటే తాము అప్పులు చేయక తప్పడం లేదని క్రెడిట్ కార్డులు వాడుకోవలసివస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఏటా అడ్డూఆపూ లేకుండా ఫీజులు పెంచుకునిపోతుంటే సామాన్యులు తమ పిల్లలను ఎలా చదివించుకోగలరని ప్రశ్నిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టిందో ప్రస్తావించవలసిన అవసరం ఉంది. టివికె ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే తమిళనాడు స్కూళ్ల (ఫీజు నియంత్రణ) సవరణ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రిటైర్డ్ హైకోర్టు జడ్జీ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో తల్లిదండ్రుల సంఘంనుంచి ఒకరికి చోటు కల్పించారు. కమిటీ ఖరారు చేసిన ఫీజులు మూడేళ్ల పాటు అమలులో ఉంటాయి. ప్రభుత్వం ఆమోదించిన ప్రతిపాదనలను నోటీస్‌బోర్డు, వెబ్‌సైట్, అడ్మిషన్ ఫారాలపై స్పష్టంగా, ముద్రించి ప్రదర్శించవలసి ఉంది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూళ్ల గుర్తింపును రద్దు చేస్తారు. ఫీజు నిర్ధారణ కమిటీ పనితీరు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఈ కమిటీ తమిళనాడు రాష్ట్రంలోని అన్ని స్కూళ్లను కలిపి ఒకే జనరల్ ఫీజును నిర్ణయించదు. దీనికి బదులుగా ప్రైవేట్ పాఠశాలల చట్టం ప్రకారం ప్రతి విద్యాసంస్థను విడివిడిగా పరిశీలిస్తుంది. ఆయా పాఠశాలల్లోని మౌలిక వసతులు, పెట్టుబడి, ఉపాధ్యాయుల వేతనాలు రోజువారీ నిర్వహణ వ్యయాల ఆధారంగానే ఆ పాఠశాల ఫీజు విధానాన్ని ఖరారు చేస్తుంది.

# వర్షాకాల సన్నద్ధతకు టీజీఎస్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు

## నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు



భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ కేంద్రాల్లో విద్యుత్ వ్యవస్థల బలోపేతానికి అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చర్యలు చేపట్టారు. వర్షాల సమయంలో కూడా వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ముందస్తు సన్నద్ధత పనులను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలోనే జూన్ 10వ తేదీన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంస్థ ఉన్నతాధికారులతో మాన్సూన్ సన్నద్ధతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా మరియు ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తూ ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రస్తుతం సంస్థ పరిధిలో దెబ్బతిన్న, శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను సిబ్బంది వేగవంతం చేశారు. వంగిపోయిన స్తంభాలను సరిచేయడం, వదులుగా ఉన్న విద్యుత్ తీగలను (లూజ్ లైన్లు) సవరించడం మరియు అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనులను ప్రాధాన్యత క్రమంలో నిర్వహిస్తున్నారు. దీనితో పాటు, భారీ గాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడి ప్రమాదాలు మరియు అంతరాయాలు కలగకుండా పెద్ద ఎత్తున ట్రీ ట్రిమ్మింగ్ (చెట్ల కొమ్మల తొలగింపు) కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టారు. ఈ పనులు ప్రారంభించే ముందు స్థానిక విద్యుత్ అధికారులు ఆయా ప్రాంతాల ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ అత్యవసర కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి భాగస్వాములు కావాలని విద్యుత్ శాఖ కోరింది. ఈ ప్రత్యేక భద్రతా పనులను వేగంగా పూర్తి చేయడానికి సంస్థ అత్యాధునిక పరికరాలను సమకూర్చుకుంది. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న 40 పరికరాలకు అదనంగా మరో 168 కొత్త పరికరాలను కొనుగోలు చేస్తుండటంతో మొత్తం 208 పోల్ ప్రూనర్లు అందుబాటు లోకి రానున్నాయి. అలాగే 59 కొత్త చైన్‌సాలు (గొలుసు రంపాలు), 530 ప్రూనింగ్ కట్టర్లను రంగంలోకి దించారు. వర్షాకాలంలో తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మరియు విద్యుత్ సరఫరా నిలిచిపోతే తక్షణమే పునరుద్ధరించేందుకు 189 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (అత్యవసర స్పందన బృందం) వాహనాలను సిద్ధంగా ఉంచారు. అలాగే కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడానికి 213 ప్రత్యేక ఫ్యూజ్ ఆఫ్ కాల్ బృందాలను మోహరించారు. వినియోగదారుల సమస్యల తక్షణ పరిష్కారం కోసం 1912 టోల్-ఫ్రీ - విద్యుత్ హెల్ప్‌లైన్‌ను 24 గంటలూ అందుబాటులో ఉంచారు. ఈ కాల్ సెంటర్ ద్వారా ఒకేసారి 400 కాల్స్ స్వీకరించే ప్రత్యేక సౌకర్యం ఉంది. వీటితో పాటు విద్యుత్ సంస్థ యొక్క అధికారిక సిటిజన్ యాప్ మరియు 87124 41912 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. వర్షాకాలం ముగిసే వరకు ఈ సేవలన్నీ 24 గంటలూ నిరంతరం పర్యవేక్షించ బడతాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడానికి సీఎండీ జితేష్ వి. పాటిల్‌తో పాటు డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షలు నిర్వహిస్తూ నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా విద్యుత్ తీగలు లేదా కేబుల్ వైర్లు తెగిపడి కనిపిస్తే ప్రజలు వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, వెంటనే అధికారులకు లేదా 1912 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి ప్రాణనష్టాన్ని నివారించాలని టీజీఎస్పీడీసీఎల్ విజ్ఞప్తి చేసింది.

# సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా ప్రారంభం

## దేశ సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనమన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్ సాలార్ జంగ్ మ్యూజియం డెబ్బై ఐదేళ్ల ప్లాటినం జూబ్లీ వారోత్సవాలు అత్యంత అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. సాలార్‌జంగ్ మూడవ నవాబ్ మీర్ యూసఫ్ అలీ ఖాన్ జయంతిని పురస్కరించుకొని ఈ వేడుకలను మ్యూజియం బోర్డు ఛైర్మన్, గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఘనంగా ప్రారంభించారు. ఈ నెల ఇరవై ఒకటి వరకు వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల తొలిరోజు కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చార్మినార్ శాసనసభ్యుడు మీర్ జుల్ఫికార్ అలీ, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావుతో పాటు సాలార్ జంగ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

### మ్యూజియం ప్రపంచ సంస్కృతుల సమ్మేళనం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మ్యూజియం ఆధునికీకరణ, విస్తరణకు సంబంధించిన ఐదేళ్ల ప్రణాళికను ఆవిష్కరించారు. అలాగే ఇక్కడి సావనీర్ షాపుతో పాటు హస్తకళలు, చేనేత ఉత్పత్తుల ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరానికి చార్మినార్ ఎంతటి గుర్తింపును తెచ్చిందో, సాలార్ జంగ్ మ్యూజియం కూడా అంతే గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకుందని కొనియాడారు. ఈ మ్యూజియం ప్రపంచ సంస్కృతుల సమ్మేళనానికి ప్రతీక అని, కేవలం తెలంగాణకే కాకుండా దేశ సాంస్కృతిక వారసత్వానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. విజ్ఞానం, ఆవిష్కరణలు, విద్యకు కేంద్ర బిందువుగా ఎదుగుతున్న ఈ మ్యూజియాన్ని పరిశోధనలు, అధ్యయనాలకు మరింత ఉపయోగపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

### మ్యూజియం హైదరాబాద్ ఆత్మకు ప్రతిరూపం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, నలభై మూడు వేల అపురూప కళాఖండాలకు నిలయమైన సాలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్ ఆత్మకు ప్రతిరూపమని కొనియాడారు. భవిష్యత్తులో అభివృద్ధి చెందబోయే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు ఈ మ్యూజియం ఒక సాంస్కృతిక కిరీటంగా మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతి విద్యార్థి ఈ మ్యూజియాన్ని సందర్శించి ఇది నా ఆస్తి అనే ఆత్మవిశ్వాసాన్ని, గర్వాన్ని పొందాలని ఆయన సూచించారు. సాలార్‌జంగ్ మ్యూజియం అభివృద్ధికి మరియు దాని విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయం అందిస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.

### ప్రపంచంలోనే అత్యున్నత మ్యూజియం: మంత్రి పొన్నం ప్రభాకర్

చివరగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సాలార్ జంగ్ మ్యూజియం మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీకగా నిలిచిందని అన్నారు. ఈ మ్యూజియం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యున్నత మరియు ఉత్తమ మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. శతాబ్దాల చరిత్రను, సంస్కృతిని కాపాడుతూ భావితరాలకు అందిస్తున్న ఈ సంస్థ ప్రయాణం ఎంతో అభినందనీయమని, దీని అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని ప్రశంసించారు.

# ప్రభుత్వ బడుల్లో నవశకం: ఉచిత అల్పాహార పథకం

వేసవి సెలవుల అనంతరం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు రోజూ ఉదయం ఉచితంగా పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని (బ్రేక్‌ఫాస్ట్) అందించే అద్భుతమైన పథకానికి నేటి నుంచే శ్రీకారం చుట్టింది. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆకలితో అలమటించకుండా, చదువుపై పూర్తి ఏకాగ్రత పెట్టాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది.

### నోరూరించే వంటకాలతో వారాంతపు మెనూ

విద్యార్థులకు ప్రతిరోజూ ఒకేరకమైన ఆహారం కాకుండా, వారికి ఇష్టమైన మరియు ఆరోగ్యకరమైన వంటకాలను అందించేలా విద్యాశాఖ ఒక ఆకర్షణీయమైన వారాంతపు మెనూను రూపొందించింది. ఈ మెనూ ప్రకారం సోమవారం దోసె-చట్నీ లేదా చపాతీ-కర్రీ, మంగళవారం మిల్లెట్ ఇడ్లీ-సాంబారు, బుధవారం పూరి-ఆలూ కుర్మా పెడతారు. అలాగే గురువారం మిల్లెట్ ఇడ్లీ-సాంబారు, శుక్రవారం మిల్లెట్ ఉప్మా లేదా పొంగల్-చట్నీ, ఇక శనివారం నాడు బోండా-చట్నీ వడ్డించనున్నారు. కేవలం టిఫిన్ మాత్రమే కాకుండా విద్యార్థులకు అదనపు పోషకాలు అందించేలా వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు ఆరోగ్యకరమైన రాగి జావను కూడా ఉదయం పూట అందిస్తారు.

### శారీరక, మానసిక వికాసానికి పెద్దపీట

ఉరుకుల పరుగుల జీవితంలో ఉదయాన్నే దినసరి పనులకు వెళ్లే పేద తల్లిదండ్రులకు ఈ పథకం ఎంతగానో ఊరట నివ్వనుంది. పిల్లలకు ఉదయం పూట కడుపునిండా ఆరోగ్యకరమైన ఆహారం లభించడం వల్ల వారిలో రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటి సమస్యలు దరిచేరవు. కడుపు నిండుగా ఉంటేనే తరగతి గదిలో పాఠాలు శ్రద్ధగా వినగలుగుతారని, తద్వారా వారి అభ్యసన సామర్థ్యాలు గణనీయంగా మెరుగవుతాయని విద్యావేత్తలు సైతం ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పిల్లల శారీరక ఎదుగుదలకు తోడ్పడేలా అకడమిక్ క్యాలెండర్‌లో బోధనతో పాటే ప్రతిరోజూ క్రీడలను సైతం విధిగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.


### కాలేజీలకూ విస్తరణ.. హాజరు శాతం పెంపే లక్ష్యం

కేవలం పాఠశాలలకే పరిమితం కాకుండా ఈ అల్పాహార పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైతం ఈ ఏడాది నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం విశేషం. కళాశాలల్లో ఈ పథకాన్ని దశలవారీగా అమలు చేసి, మొత్తం 1.44 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 30 వేల ప్రభుత్వ స్కూళ్లలో 24 లక్షల మంది విద్యార్థులు ఉండగా, కేవలం 10 వేల ప్రైవేటు విద్యాసంస్థల్లోనే 36 లక్షల మంది చదువుతున్నారు. ఈ పరిస్థితిని మార్చి, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు, విద్యార్థుల దైనందిన హాజరు శాతాన్ని భారీగా పెంచడమే లక్ష్యంగా గత రెండేళ్లుగా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువస్తోంది. అందులో బాగంగానే అమల్లోకి వచ్చిన ఈ బ్రేక్ ఫాస్ట్ స్కీం, ప్రభుత్వ విద్యాసంస్థల పట్ల తల్లిదండ్రుల్లో మరింత నమ్మకాన్ని పెంచుతుందని విద్యాశాఖ ధీమా వ్యక్తం చేస్తోంది.



# తెలంగాణలో ఆందోళనకరంగా కిడ్నీ వ్యాధులు: మరణాల్లో దేశంలోనే టాప్!

తెలంగాణ రాష్ట్రంలో కిడ్నీ వ్యాధులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఐసీఎంఆర్ తాజా అధ్యయనం ప్రకారం, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (సీకేడీ) కేసుల్లో మరియు మరణాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్-2023' నివేదిక ఆధారంగా ఢిల్లీ వైద్య నిపుణులు విశ్లేషించిన డేటాలో ఈ షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో ప్రతి లక్ష మంది జనాభాలో ఏకంగా 10,601 మంది ఈ ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నారు. అలాగే, కిడ్నీ వ్యాధుల కారణంగా సంభవిస్తున్న మరణాల రేటు కూడా రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా కిడ్నీ వ్యాధులకు సంబంధించి అత్యల్ప మరణాల రేటు రాజస్థాన్‌లో ప్రతి లక్ష మందికి 6.71గా ఉండగా, తెలంగాణలో అది ఏకంగా 19.84గా నమోదై జాతీయ సగటును దాటేసింది. వైకల్యం మరియు అకాల మరణాల కారణంగా కోల్పోతున్న ఉత్పాదక జీవిత సంవత్సరాల (ఆరోగ్యకర జీవితకాలం) రేటులోనూ రాజస్థాన్




(312.2) తో పోలిస్తే తెలంగాణ (666.38) మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఈ వ్యాధి ఇంతలా ప్రబలడానికి ప్రధాన కారణం మధుమేహమేనని పరిశోధకులు తేల్చారు. షుగర్ వ్యాధిని సకాలంలో నియంత్రించకపోవడం వల్లే కిడ్నీలు వేగంగా దెబ్బతింటున్నాయి. జాతీయ స్థాయిలో కిడ్నీ వ్యాధులకు మధుమేహం కారణమయ్యే శాతం 18 నుంచి 24 మధ్య ఉండగా, తెలంగాణలో ఆ శాతం మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం. గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా కిడ్నీ వ్యాధుల కేసులు, మరణాల రేటు తగ్గుముఖం పడుతున్నా తెలంగాణలో మాత్రం పరిస్థితి ఇంకా ప్రమాదకరంగానే ఉంది. ముఖ్యంగా పేద వర్గాల్లో వ్యాధిపై కనీస అవగాహన లోపించడం, లక్షణాలు కనిపించినా ప్రారంభ దశలో గుర్తించకపోవడం వల్లే ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు కిడ్నీ వ్యాధులను ఒక ప్రత్యేక ప్రజారోగ్య సమస్యగా గుర్తించి, ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని పరిశోధకులు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే బీపీ, షుగర్ రోగులకు క్రియాటినిన్, మూత్ర పరీక్షలు విధిగా నిర్వహించాలి. అలాగే, పేద రోగులకు సులభంగా, ఉచితంగా డయాలసిస్, కిడ్నీ మార్పిడి సేవలు అందేలా వైద్య మౌలిక సదుపాయాలను వెంటనే బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# భారతదేశ ఇంధన రంగానికి మహర్దశ..

## అండమాన్‌లో అపార సహజ వాయువు నిక్షేపాలు!

అండమాన్‌లో అన్వేషణ వరుసగా రెండోసారి విజయవంతమైంది. అరవై ఆరు శాతం సాఫల్య రేటుతో అపారమైన సహజ వాయువు లభ్యం కావడం, అందులో అత్యంత నాణ్యమైన ఎనభై ఐదు శాతం మిథేన్ వాయువును గుర్తించడం దేశ ఇంధన స్వయంసమృద్ధికి బాటలు వేస్తోంది. అయితే వాణిజ్య పరమైన ఉత్పత్తికి మరో పదేళ్ల సమయం పట్టవచ్చని అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ భారతదేశానికి భారీ ఊరట లభించింది. అండమాన్ సముద్రంలో వరుసగా రెండోసారి అపారమైన సహజ వాయువు నిక్షేపాలు బయటపడ్డాయి. భారీ అంచనాలతో సహజ వాయువు లభ్యం కావడం దేశవ్యాప్తంగా కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చమురు వెలికితీత భారీ ప్రాజెక్టులు విజయవంతమైతే, ఇంధన రంగంలో భారత్ స్వయం సమృద్ధిని సాధించే అవకాశం ఉంది.

### 'విజయపురం-3'లో భారీ నిక్షేపాలు

ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ ఇండియా లిమిటెడ్ అండమాన్ దీవుల తూర్పు తీరానికి దాదాపు పదిహేను కిలోమీటర్ల దూరంలో సముద్ర గర్భంలో 'విజయపురం-3' అనే అన్వేషణ బావిని తవ్వింది. ప్రాథమిక పరీక్షల్లో ఇక్కడ భారీగా సహజ వాయువు ఉన్నట్లు కేంద్ర పెట్రోలియం శాఖ అధికారికంగా ప్రకటించింది.

### అరుదైన విజయం..

సాధారణంగా సముద్ర గర్భంలో చమురు, సహజ వాయువు అన్వేషణలో సాఫల్య రేటు చాలా తక్కువగా ఉంటుంది. కానీ, అండమాన్ బేసిన్‌లో ఇప్పటి వరకు తవ్విన మూడు బావుల్లో.. రెండింటిలో సహజ వాయువు లభించడం విశేషం. అంటే



ఇక్కడ అన్వేషణ అత్యధిక శాతంలో విజయవంతమైంది. గతంలో 'విజయపురం-2' నుంచి సేకరించిన నమూనాలను కాకినాడ ప్రయోగశాలలో శాస్త్రవేత్తలు పరీక్షించగా, అందులో ఎనభై ఐదు శాతానికి పైగా అత్యంత నాణ్యమైన మిథేన్ వాయువు ఉన్నట్లు తేలింది. మయన్మార్‌లోని ప్రసిద్ధ 'శ్వే' సహజ వాయువు క్షేత్రం, ఇండోనేషియాలోని చమురు క్షేత్రాలు ఏ భౌగోళిక పొరల ఆధారంగా ఏర్పడ్డాయో.. అండమాన్ బేసిన్ కూడా అదే పొరలకు అనుసంధానమై ఉండటంతో ఇక్కడ భవిష్యత్తులో మరిన్ని భారీ నిక్షేపాలు బయటపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

### వినియోగానికి మరో పదేళ్లు.. సవాళ్లు అనేకం

సహజ వాయువు నిక్షేపాలు లభించినప్పటికీ, అవి మన ఇళ్లకు, పరిశ్రమలకు చేరడానికి కనీసం మరో పదేళ్ల సమయం పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం ఒకే బావితో వాయువు పరిమాణాన్ని అంచనా వేయలేము. చుట్టు పక్కల మరికొన్ని బావులు తవ్వి మొత్తం ఎన్ని బిలియన్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువు ఉందో లెక్కగట్టాల్సి ఉంటుంది. వాయువు నాణ్యత, లోపల ఉన్న ఒత్తిడి, వెలికితీత ఖర్చులపై సమగ్ర నివేదికను తయారు చేయాలి. సముద్రం మధ్యలో భారీ నిర్మాణాలు, సముద్రం లోపల పైప్‌లైన్లు, తీర ప్రాంతంలో శుద్ధి కర్మాగారాలు నిర్మించడానికి వేల కోట్ల పెట్టుబడులు అవసర మవుతాయి. వీటన్నింటికీ మించి అండమాన్ వంటి పర్యావరణ సున్నిత ప్రాంతంలో పర్యావరణ అనుమతులు సాధించడం కాస్త ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. అండమాన్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైతే.. గల్ఫ్ దేశాలపై భారత్ దిగుమతుల కోసం ఆధారపడటం తప్పు తుందని వ్యాపార నిపుణులు చెబుతున్నారు.

### ప్రత్యామ్నాయంగా బొగ్గు గ్యాసిఫికేషన్

అండమాన్ సహజ వాయువు మార్కెట్లోకి రావడానికి మరో పదేళ్లు పడుతున్న నేపథ్యంలో.. ఈ లోపు భారత్ తన ఇంధన కష్టాలను తీర్చుకోవడానికి బొగ్గును ఆయుధంగా మార్చుకుంటోంది. బొగ్గును గ్యాస్‌గా మార్చే జాతీయ మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం ముప్పై ఏడు వేల ఐదు వందల కోట్ల భారీ బడ్జెట్‌తో వేగవంతం చేసింది. రెండు వేల ముప్పై నాటికి దేశంలో వంద మిలియన్ టన్నుల బొగ్గును గ్యాస్‌గా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# మా గ్రామాలను ఎఫ్సీడీఏలో కలపండి

## కొత్తగా 15 గ్రామాల విలీనానికి సీఎం గ్రీన్ సిగ్నల్ మరో 10గ్రామాల నుంచి డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భారత్ ఫ్యూచర్ సిటీ సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. రంగారెడ్డి జిల్లాలోని 765.28 చదరపు కిలోమీటర్ల పరిధిలోని ఆమన్ గల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, మహేశ్వరం, మంచాల్, యాచారం మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డవలప్ మెంట్ అథారిటీ(ఎఫ్సీడీఏ) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం గతేడాది డిసెంబర్ లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ తో కార్పొరేట్ కంపెనీలు ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. దీంతోపాటు ఎఫ్సీడీఏ ఆఫీసు కూడా ప్రారంభం కావడంతో దీనికి చైర్మెన్ గా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి తరుచుగా రానున్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఎఫ్సీడీఏ వైస్ చైర్మెన్ శ్రీధర్ బాబు సైతం వారానికొకసారి ఇక్కడ ఉండే అవకాశముందని సీఎం వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొత్తగా తమ గ్రామాలను సైతం భారత్ ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని డిమాండ్ పెరుగుతోంది. కొత్తగా 15గ్రామాలను విలీనానికి సంబంధించిన ఫైల్ పై సీఎం సంతకం చేశారు. మరిన్ని గ్రామాలను నుంచి కూడా డిమాండ్ వస్తోంది.

### కార్పొరేట్ ఆఫీసులకు అడ్డాగా...


ఫ్యూచర్ సిటీ కార్పొరేట్ ఆఫీసులకు అడ్డాగా మారనుంది. ఇప్పటికే సింగరేణి కాలరీస్ కార్పొరేట్ గ్లోబల్ ఆఫీస్ నిర్మించనున్నారు. దీని కోసం 10 ఎకరాల స్థలం కేటాయించారు. నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్ మెంట్(ఎన్ఐయూఎం)కు 20ఎకరాలు కేటాయించారు. గతంలో ప్రభుత్వం శంషాబాద్ ఏరియాలో టీఈఈఆర్ఎల్, ఐఐపీహెచ్, వాలంతరీ సంస్థలకు భూములు కేటాయిచింది. 500 ఎకరాల్లో నిర్మించే ఏఐ జోన్ కు ఆధునిక హంగులతో ఏఐ సిటీ ఆఫీసును నిర్మించనున్నారు. ప్రపంచంలో 500 పేరుమోసిన కార్పొరేట్ సంస్థలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆఫీసులు హైదరాబాద్ లో 85 మాత్రమే ఉన్నాయి. కానీ ఫ్యూచర్ సిటీలో 500 ఫార్చూన్ కంపెనీలకు సంబంధించిన ఆఫీసులను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని, అందుకు బాధ్యత తీసుకుంటానని స్వయాన సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

### 56గ్రామాలు...

హెచ్ఎండీఏ పరిధిలోని 36గ్రామాలతోపాటు కొత్తగా 20గ్రామాలను కలిపి ఎఫ్సీడీఏ ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహడ్, పోచారం, రామిరెడ్డిగుడ, తడ్లకల్వ, తులేకలాన్, తుర్కగుడ, ఎలిమినేడు, ఎర్రకుంట గ్రామాలు ఉన్నాయి. కందుకూరు మండలంలోని అన్నోజిగుడ, దబ్లీగుడ,దాసర్లపల్లి, గఫూర్ నగర్, గూడురు, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, లేమూరు, మాదాపురం, మీర్ ఖాన్ పేట్, ముచ్చెర్ల, మహ్మద్ పూర్, పంజాగుడ, రాచలూరు, సర్వరావులపల్లి, తిమ్మాపూర్, తిమ్మాయపల్లి, మహేశ్వరం మండలంలోని మహబ్బత్ నగర్, తుమ్మలూరు, మంచాల్ మండలంలోని ఆగాపల్లి, మల్లిఖార్జునగుడ, నోముల, యాచారం మండలంలోని చౌదర్ పల్లి, గున్ గల్, మొగుళ్లవంపు, తులేఖుర్దు గ్రామాలు ఉన్నాయి. వీటితోపాటు ఆమన్ గల్ మండలంలోని కొనాపూర్, రాంనుంతల, కడ్తాల్ మండలంలోని చరికొండ పట్టి కల్వకుర్తి, చరికొండ పట్టి పడ్కల్, ఎక్రాజ్ గుడ, కడ్తాల్, కర్కల్ పహడ్, ముద్విన్, కందుకూర్ మండలంలోని దెబ్బడగుడ, యాచారం మండలంలోని కొత్తపల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీగ్ గుడ, నక్కర్త, నానక్ నగర్, నందివనపర్తి, నజ్దిక్ సింగారం, తక్కల్లపల్లి, తాటిపర్తి, చింతపట్ల, నల్లవెల్లి రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

### 15గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్...

కందుకూరు, యాచారం మండలాల్లోని 15గ్రామాలను భారత్ ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫైల్ పై సంతకం కూడా చేశారు. త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనుంది. విలీన గ్రామాల్లో యాచారం మండలంలోని మంథన్ గౌరెల్లి, మొండిగౌరెల్లి, సుల్తాన్ పూర్, కందుకూరు మండలంలోని నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్ ఉన్నాయి. వీటితోపాటు మహేశ్వర్ మండలంలోని పెండ్యాల, సుభాన్ పూర్, ఉప్పుగడ్డ తాండ, తుప్రకుర్దు,కోళ్లపడ్కల్, మన్ సాన్ పల్లి, రాంచంద్రగుడ, గంగారం, ఎండితాండ గ్రామాలను విలీనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిపాదనలు పంపించారు. అయితే దూరం ఎక్కువగా ఉండడంతో తాత్కాలికంగా పక్కనపెట్టినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిపారు.




# వికాసం పాఠశాలలో దివ్యాంగ బాలికలకు అవకాశం: పీవో రాహుల్

భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నడపబడుతున్న వికాసం పాఠశాలల్లో గిరిజన విద్యార్థులే కాకుండా ఎవరైనా దివ్యాంగ బాలికలకు ఒకటవ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. వికాసం పాఠశాలలో చేరే బాల బాలికలకు గ్రూప్ హియరింగ్ ఎయిడ్, ఆడియో మెట్రి, స్పీచ్ థెరపీ, కంప్యూటర్ ల్యాబ్ మరియు టైలరింగ్ శిక్షణ నేర్పించడంతో పాటు సాంస్కృతిక, నృత్య శిక్షణ నిపుణులైన ఉపాధ్యాయులచే



అందించడం జరుగుతుందని, దానితోపాటు స్కూల్ యూనిఫార్మ్స్, రెండు జతలు ట్రాక్ షూస్, స్లిప్పర్స్, షూస్ సాక్స్, నోట్ బుక్స్, టెస్ట్ బుక్స్, బెడ్ షీట్స్, కార్పెట్స్, మంచాలు, పరుపులు, దిండ్లు, ప్లేట్, గ్లాస్, కాస్మోటిక్ అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం.. ఆహారం అందించడం జరుగుతుందని అన్నారు. కావున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని దివ్యాంగ బాల బాలికలు ఏడు సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయసు గల పిల్లలను వికాసం పాఠశాలలో చేర్పించి పిల్లల యొక్క బంగారు భవిష్యత్తు బాగుపడేలా పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు. ఇతర వివరాలు కొరకు ఫోన్ నెంబర్లు 9381181407, 6303947240, 80 7455 09 53, 9652272266, 9666 079593 నెంబర్లను సంప్రదించి తెలుసుకోవాలని ఆయన కోరారు.

# ప్రైవేటుకు దీటుగా సర్కారు బడి.. ఆరుట్ల

## 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' అడ్మిషన్లు ఫుల్!




రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల ఉన్నత పాఠశాలను రాష్ట్రంలోనే తొలి పైలట్ ప్రాజెక్టు కింద 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'గా తీర్చిదిద్దారు. ఈ పాఠశాల అధికారికంగా ప్రారంభోత్సవం జరుపుకోక ముందే విశేష ఆదరణను చూరగొంటూ, ప్రవేశాల కోసం విద్యార్థులు పోటెత్తుతుండటంతో గేటుకు ఏకంగా 'నో అడ్మిషన్' బోర్డును ఏర్పాటు చేసే స్థాయికి చేరుకుంది. సర్కారు స్కూళ్ల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, క్రీడా నైపుణ్యంతో పాటు విద్యా బోధనలో పెంచుతున్న నాణ్యతకు తల్లిదండ్రులు ఫిదా అవుతున్నారు. తమ పిల్లలను ఇక్కడే చేర్పించేందుకు వారు అమితాసక్తి చూపుతున్నారు. పబ్లిక్ స్కూల్ గురించి ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం నిర్వహించడం, సదుపాయాలు మెరుగు పడటంతో గత ఏడాదితో పోలిస్తే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠశాలలో వాస్తవానికి 1600 మంది విద్యార్థులకే అవకాశం ఉన్నప్పటికీ, తల్లిదండ్రుల నుంచి వస్తున్న విపరీతమైన డిమాండ్ దృష్ట్యా 1700 మందిని చేర్చుకున్నట్లు, అందుకే ప్రవేశాలు నిలిపివేస్తూ బోర్డు ఏర్పాటు చేయక తప్పలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ మీడియాతో స్పష్టం చేశారు. ఐదు ఎకరాల విశాల ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నిధులతో ఈ పాఠశాలను ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రాథమిక, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్‌ను ఒకే ప్రాంగణంలోకి తెచ్చి, నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నారు. ఆర్కిటెక్ట్ డిజైన్లతో కూడిన భవనాలు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఫుట్‌బాల్, క్రికెట్ మైదానాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను సైతం నడుపుతున్నారు. ప్రతి తరగతిని రెండు సెక్షన్లుగా విభజించి మొత్తం 61 మంది ఉపాధ్యాయులతో డిజిటల్ విధానంలో నాణ్యమైన బోధన అందిస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ కూడా ఇక్కడే సమకూరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న ఈ కార్పొరేట్ స్థాయి సౌకర్యాలపై నమ్మకం పెరగడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్లోనే సగర్వంగా చదివిస్తున్నారు.

# బీజేపీ ఆడించే తోలుబొమ్మ పవన్ కల్యాణ్

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీలో రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ పదే పదే కించ పరిచే మాటలు మాట్లాడుతున్నారని మండిప డ్డారు. ఇవాళ హైదరాబాద్ గాంధీ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కలను కాంగ్రెస్ సాకారం చేసిందన్నారు. బీజేపీ నేతలు పలికితే పవన్ మాట్లాడుతున్నారని, బీజేపీ ఆడించే తోలుబొమ్మ పవన్ అని ఎద్దేవా చేశారు. విచ్చలవిడిగా మాట్లాడడానికి ఇదేమీ సినిమా కాదని, ఎంతో మంది అమరులైతే, సోనియా తెలంగాణ ఇచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలు చూడనిదే నీ సినిమాలు ఆడాయా? ఇంత పెద్ద హీరోవు అయ్యావా? అని ప్రశ్నించారు.

### మీరింకా చాలా నేర్చు కావాల్సింది ఉంది పవన్..

ఏపీ డిప్యూటీ సీఎంగా ఏపీలో మీరు చెయ్యా ల్సింది ఉందని, రాజకీయాల్లో ఇంకా మీరు నేర్చు కోవాల్సింది చాలా ఉందని పవన్కు టీపీసీసీ చీఫ్ హితవు పలికారు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే సరికాదని, ఇలాగే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత పవన్కు లేదని, ఆయన రాజకీయంగా చాలా చిన్న వాడన్నాడు. బీజేపీతో లోపాయికారి ఒప్పందంతో విభజన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదన్నారు. రెండు రాష్ట్రాలు వేరైన అన్నదమ్ములుగా కలిసి ఉందామని సూచించారు.



# సమాచార హక్కు అప్పీల్‌పై జూన్ 16న విచారణ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**

తెలంగాణ సమాచార కమిషన్ ఎదుట దాఖలైన సమాచార హక్కు (ఆర్‌టీఐ) రెండో అప్పీల్‌పై ఈ నెల 16న విచారణ నిర్వహించనున్నట్లు కమిషన్ నోటీసు జారీ చేసింది. మంచిర్యాల జిల్లాకు చెందిన లింగం రాజయ్య దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను జూన్ 16న మధ్యాహ్నం 2 గంటలకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విచారణకు ప్రతివాదులుగా ఉన్న లిసింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లికు చెందిన ప్రజా సమాచార అధికారి, తొలి అప్పీలేట్ అథారిటీతో పాటు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ యూనిట్) హాజరుకావాలని కమిషన్ ఆదేశించింది. ఆర్‌టీఐ దరఖాస్తుపై తీసుకున్న చర్యలు, సమాచారం అందించిన ఆధారాలు, పంపిణీ రసీదులు, అవసరమైన రిజిస్టర్లు, అఫిడవిట్లతో హాజరు కావాలని సూచించింది.
అప్పీలుదారుడు కూడా తాను కోరిన సమాచారం అందలేదని లేదా అసంతృప్తికరంగా ఉందని భావిస్తున్న అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అఫిడవిట్‌తో సమాచార హక్కు కమిషనర్ల
లి డా. జి. చంద్రశేఖర్ రెడ్డి (ఐఆర్‌ఎస్, రిటైర్డ్) -- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్
లి పి.వి. శ్రీనివాసరావు -- రాష్ట్ర సమాచార కమిషనర్--×
లి మొహ్సినా పర్వీన్ -- రాష్ట్ర సమాచార కమిషనర్--××
లి దేశాల భూపాల్ -- రాష్ట్ర సమాచార కమిషనర్--×××
లి బొరెడ్డి అయోధ్య రెడ్డి -- రాష్ట్ర సమాచార కమిషనర్--×ు
సమాచార హక్కు కమిషన్ విచారణకు రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వం వహించగా, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, బొరెడ్డి హాజరు కానున్నారు.

# పట్టుదలతో చదివి ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలి: మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**

ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలని కమాన్‌పూర్ మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అన్నారు. సోమవారం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కమాన్‌పూర్, జూలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికింది. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ఆహ్వానించారు. ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమిష్టిగా పాల్గొని పాఠశాల ఆవరణను మామిడి తోరణాలు, బెలూన్లు, అరటి చెట్లతో అలంకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, షూస్‌తో పాటు నాణ్యమైన విద్య, డిజిటల్ బోధన, కంప్యూటర్ విద్య, అర్హత కలిగిన ఉపాధ్యాయుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను వినియోగించుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయురాలు కాళిదా, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, రజనీ వందన, సతీష్, రమేష్, రజిత కుమారి, జూలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు నాగరాజు, గంగారాం, శ్రీనివాస్, శిరోమణి, శ్రీదేవి, వేణుగోపాల్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# ఈనెల 18న తెలంగాణ కేబినెట్ సమావేశం



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ నెల 18న జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా మెట్రో టేకోవర్ అంశంపై ఏర్పడిన సందిగ్ధ పరిస్థితుల నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

## 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి: సెక్టార్ సూపర్వైజర్ శారద

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**



మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో గల 5వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఏఎల్ఎంఎస్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో తల్లులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ శారద మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆ వయస్సు పిల్లల కోసం ఇంటింటి సందర్శన నిర్వహించి, అంగన్వాడీ కేంద్రాలకు పంపాల్సిన అవసరాన్ని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై తల్లులను అడిగి తెలుసుకున్న సూపర్వైజర్, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఆహారాన్ని ప్రతి చిన్నారికి అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ శారదతో పాటు అంగన్వాడీ టీచర్లు ఉదయమ్మ, శారదమ్మ, పార్వతమ్మ, మారుపాక నిఖిల, ఆయాలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**



గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధి అంశాలపై అత్యవసర సమావేశం నిర్వహించారు. సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలోని అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై వార్డు సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవసరమైన జాగ్రత్తలపై తమ తమ వార్డుల్లో అవగాహన కల్పించాలని వార్డు సభ్యులకు సూచించారు. వర్షాల సమయంలో పారిశుద్ధ్యం, తాగునీటి సంరక్షణ, దోమల నివారణ, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాము, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, వార్డు సభ్యులు గోడిశెల లింగస్వామి, మెరుగు కుమార్, పచ్చునూరి రాజ్‌కుమార్, గుంజపడుగు నవీన్, తూటి రాజు, కమ్మగొని మౌనిక, మేడగొని సత్యమ్మ, గొట్టే సరిత, బొగే పద్మ, మిట్ట సందీప్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# పామాయిల్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం

## జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**



మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు నెత్తుట్ల మల్లయ్య తోటలో 4.20 ఎకరాల్లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పామాయిల్ మొక్కలను నాటారు. అనంతరం ఉద్యాన శాఖ సబ్సిడీతో ఏర్పాటు చేసిన డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, కూరగాయల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా పామాయిల్‌తో పాటు ఇతర ఉద్యాన పంటల సాగు, బిందు సేద్య పరికరాలపై ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. ఒక ఎకరానికి 50 నుంచి 57 పామాయిల్ మొక్కలు నాటవచ్చని, ఈ పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని తెలిపారు. ఒకసారి నాటితే సుమారు 30 సంవత్సరాల పాటు దిగుబడి లభిస్తుందని, ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ.1.20 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. రైతులు పండించిన పామాయిల్ గెలలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కంపెనీలు కొనుగోలు చేసి, ఏడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ గెలల ధర మెట్రిక్ టన్నుకు రూ.23,852గా ఉందన్నారు. ఒక్క మొక్కకు రూ.20 చెల్లించి, ఎకరానికి రూ.1,140తో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పామాయిల్ పంట మూడున్నర సంవత్సరాల తర్వాత దిగుబడికి వస్తుందని, మొక్కల మధ్య సుమారు 9 మీటర్ల దూరం ఉండటంతో ఆ ఖాళీ ప్రదేశంలో కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, పసుపు, అరటి, కోకో వంటి అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. పామాయిల్ మొక్కలు నాటిన రైతులకు నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది రూ.4,200 ప్రోత్సాహకంగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. తెలంగాణ సూక్ష్మ సేద్య పథకం కింద బిందు సేద్య పరికరాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80 శాతం, ఓసీ రైతులకు 70 శాతం రాయితీ అందిస్తున్నామని పేర్కొన్నారు. పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాల సాగుకు 50 శాతం సబ్సిడీ, కూరగాయల నారు, వెదురు మొక్కలను 100 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. పథకాలపై ఆసక్తి ఉన్న రైతులు మంథని డివిజన్ ఉద్యాన విస్తరణ అధికారి ఆళ్ల రాజశేఖర్‌ను (సెల్: 9908387065) సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డివిజన్ అధికారి ఎ. జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి రాజశేఖర్, డ్రిప్ కంపెనీ సిబ్బంది, తిరుమల పామాయిల్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, పామాయిల్, కూరగాయల రైతులు పాల్గొన్నారు.

# గోదావరిఖని టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పెద్దపల్లి డీసీపీ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**






రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ డీసీపీ బి. రామ్ రెడ్డి సోమవారం గోదావరిఖని డివిజన్ పరిధిలోని గోదావరిఖని ×× టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి గోదావరిఖని ×× టౌన్ సీఐలు ప్రసాద్‌రావు, లింగమూర్తి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డీసీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం రిసెప్షన్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు, అధికంగా నమోదవుతున్న నేరాల స్వరూపం, రౌడీ షీటర్ల వివరాలు, అనుమానితుల ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. అలాగే బ్లూ కోల్ట్స్ సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణ సమయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి స్టేషన్ అధికారి రౌడీ షీటర్ల నివాసాలను సందర్శించి వారి కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని పేర్కొంటూ, పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

# వేములవాడ రాజరాజేశ్వర స్వామికి గడ్డి విరాళం అందజేసిన ఏగుర్ల రాజు

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**

ముత్తారం మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన ఏగుర్ల రాజు సోమవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి గడ్డి విరాళంగా అందజేశారు. స్వామివారి ఆలయంలోని గోశాలలో ఉన్న గోవుల సంరక్షణ కోసం ఈ గడ్డి వితరణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యుల శ్రేయస్సు, ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. గోసేవలో భాగంగా గడ్డి విరాళం అందించడం పట్ల ఆలయ అధికారులు, భక్తులు ఏగుర్ల రాజును అభినందించారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక





## స్టేజ్‌పై అందరి ముందు విజయ్ మీసం మెలేసిన రష్మిక..

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మరోసారి తన సేవా కార్యక్రమాలతో అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల తన పెళ్లి రిసెప్షన్ సందర్భంగా సొంత గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తానని ప్రకటించిన విజయ్.. ఇప్పుడు ఆ మాటను కార్యరూపంలో చూపించారు. ఇక విజయ్ దేవరకొండ తన భార్య రష్మికతో కలిసి స్వగ్రామమైన తుమ్మన్‌పేటను సందర్శించారు. గ్రామస్థుల మధ్య ఎంతో ఆప్యాయంగా గడిపిన ఆయన, 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 9వ, 10వ తరగతి టాపర్ విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు. మొత్తం 45 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను విజయ్, రష్మిక స్వయంగా అందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరనే నమ్మకాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీగా హాజరయ్యారు. తమ గ్రామానికి చెందిన హీరో ఇలా తిరిగి వచ్చి పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేయడం గర్వకారణమని పలువురు గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో కూడా విజయ్ చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది.




## అమ్మాయిల ఎంపికలో అమీర్‌కు మంచి టేస్ట్ ఉంది .. మాజీ భార్య ముందే కాజోల్

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్ కెరీర్‌లోనే కాకుండా భారతీయ సినీ చరిత్రలో కూడా ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన 'లగాన్' చిత్రం విడుదలై 25 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా ముంబైలో నిర్వహించిన 'లగాన్' సిల్వర్ జూబ్లీ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. అయితే ఈ కార్యక్రమంలో కాజోల్, జూహీ చావ్లా చేసిన సరదా వ్యాఖ్యలే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకకు సల్మాన్ ఖాన్, జావేద్ అక్తర్, కాజోల్, జూహీ చావ్లా తదితర ప్రముఖులు హాజరయ్యారు. వేదికపై మాట్లాడిన కాజోల్, అమీర్ ఖాన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అక్కడున్న వారిని కడుపుబ్బా నవ్వించాయి. అమీర్ ఖాన్ సినిమాల ఎంపిక చూస్తే ఆయనకు ఎంత మంచి అభిరుచి ఉందో తెలుస్తుంది. 'లగాన్'తో ప్రారంభమైన ఆయన ప్రొడక్షన్ ప్రయాణం ఇప్పటికీ విజయవంతంగా కొనసాగుతోంది. సినిమాల్లో మాత్రమే కాదు, మహిళల ఎంపికలో కూడా అమీర్‌కు చాలా మంచి టేస్ట్ ఉంది అంటూ కాజోల్ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో అమీర్ ఖాన్ కూడా నవ్వారు.

## 'బాషా' స్ఫూర్తితో 'మా ఇంటి బంగారం'..

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఈ సినిమా కథ వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాలను దర్శకురాలు నందిని రెడ్డి వెల్లడించడంతో మూవీ మరింత చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో నందిని రెడ్డి మాట్లాడుతూ, సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కల్ట్ క్లాసిక్ 'బాషా' చిత్రంలోని కథా నిర్మాణం నుంచి ప్రేరణ పొందినట్లు తెలిపారు. అయితే అదే కథను కాపీ చేయకుండా, ఒక మహిళా ప్రధాన పాత్రను కేంద్రంగా చేసుకుని పూర్తిగా కొత్త కోణంలో కథను మలిచామని చెప్పారు. 'బాషా'లో హీరోకు ఒక రహస్యమైన గతం ఉంటుంది. అదే తరహా టెంప్లేట్‌ను తీసుకుని, ఒక మహిళ అలాంటి పరిస్థితిలో ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచనతో కథను రూపొందించాం. ఆధునిక ప్రేక్షకులకు నచ్చేలా అనేక మార్పులు చేసి కొత్తగా చూపించేందుకు ప్రయత్నించాం" అని నందిని రెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉంటే, ఈ సినిమా మొదట సమంత కోసం కాకుండా సాయి పల్లవిని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ అనే విషయం కూడా బయటకు వచ్చింది. ఇటీవల సమంత విడుదల చేసిన వీడియోలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, నందిని రెడ్డి తొలుత సాయి పల్లవి కోసం కథ సిద్ధం చేశారని చెప్పారు.





## గుండె పేలిపోతోందే..!

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, ఘట్టమనేని రమేశ్‌బాబు తనయుడు ఘట్టమనేని జయకృష్ణని చిత్రసీమకు పరిచయం చేస్తూ అజయ్‌భూపతి తెరకెక్కిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రవీనా టాండన్ కుమార్తె రషా తడాని కథానాయికగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని పి.కిరణ్ నిర్మిస్తున్నారు. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలన్నీ సినిమాపై అంచనాలు పెంచాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ సినిమాలోని మూడో పాటకు చెందిన అప్డేట్‌ని మేకర్స్ అందించారు. 'గుండె పేలిపోతోందే..' అంటూ సాగే ఈ పాటను ఈ నెల 16న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ క్రమంలోనే ఓ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. దేవాలయం నేపథ్యంలో కనిపిస్తున్న హీరోహీరోయిన్లను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వారి ప్రేమలోని భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ, ఫీల్‌గుడ్ వైబ్‌ని ఈ పోస్టర్ క్రియేట్ చేస్తున్నది. ప్రఖ్యాత నటుడు మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జయకృష్ణ ×ూజ, సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: చందమామ కథలు.



## దేవుడు వరమందిస్తే..

సందీప్ అశ్వ, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రిస్క్'. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. జీకే మిరాకిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాని జూన్ 26న విడుదల చేయనున్నారు. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలో 'దేవుడు వరమందిస్తే..' అంటూ సాగే మెలోడీయస్ సాంగ్‌ని ప్రముఖ దర్శకుడు నక్కిన త్రినాథరావు విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు ఘంటాడి కృష్ణ, హీరో సందీప్ అశ్వ, చిత్ర నిర్మాతలు రవి సురేశ్‌రెడ్డి, గుర్రం నర్సిములు, సహ నిర్మాత గడ్డం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రేమ, స్నేహం, ఎమోషన్స్, సస్పెన్స్ అంశాల మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం యువతను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు.



# జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గం: మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15:**

విదేశీ భాషలు, ముఖ్యంగా జర్మన్ భాషను నేర్చుకునే విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే భాషా ప్రావీణ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.సోమవారం హైదరాబాద్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జర్మనీలో ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో ఉన్న యువత కోసం టామ్‌కామ్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో అవకాశాలు ఉన్నప్పటికీ, జర్మనీలో లభించే వేతనాలు మరింత ఆకర్షణీయంగా ఉంటాయని అన్నారు.ఇటీవల మంచిర్యాల జిల్లా మందమర్రిలో



ప్రారంభించిన జర్మన్ భాషా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభించిందని, సుమారు 200 మంది యువత కోర్సుల్లో చేరడం సంతోషకరమని మంత్రి తెలిపారు. విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, భాషలో మెరుగైన ప్రావీణ్యం సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.విదేశీ ఉపాధి అవకాశాలను పొందడంలో భాషా నైపుణ్యమే ప్రధాన అడ్డంకిగా మారుతోందని, అందుకే ఒక్క తరగతిని కూడా మిస్ కాకుండా క్రమం తప్పకుండా హాజరై భాషపై పూర్తి పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు.తాను కూడా నిరంతర సాధన, పట్టుదలతోనే తెలుగు భాషను నేర్చుకున్నానని మంత్రి గుర్తుచేస్తూ, ఏ భాషనైనా నేర్చుకోవాలంటే నిరంతర అభ్యాసమే విజయానికి మూలమని పేర్కొన్నారు. ఇటువంటి భాషా శిక్షణ కార్యక్రమాలు యువతకు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉపాధి అవకాశాలు, విజయవంతమైన కెరీర్ నిర్మించుకునేందుకు దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## 4వ వార్డులో నూతన సీసీ డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ



**అర్జున్ సమాచారం జూన్ 15 మంచిర్యాల:ప్రతిని.**

జైపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 4వ వార్డు ప్రజల విజ్ఞప్తుల మేరకు ఆర్ అండ్ బీ రహదారి నుండి పాలమాకుల రవీందర్ రెడ్డి ఇంటి వరకు నూతన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూన భాస్కర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైన్ నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షపు నీటి నిల్వ సమస్యకు పరిష్కారం లభించి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రవణ్ కుమార్, వార్డు సభ్యుడు కళ్యాణపు సతీష్ కుమార్, గద్దల నవీన్, అంబల్ల సంపత్ రెడ్డి, మాజీ మండల ప్రాదేశిక సభ్యుడు మంతెన లక్ష్మణ్, అంబల్ల రవీందర్, ప్రశాంత్ రెడ్డి, ఇరిగిరాల లింగయ్య, బిస్కుల రవి తదితర ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేరాలని విద్యార్థులకు అవగాహన



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15:**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించే లక్ష్యంతో ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపి వీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 9వ, 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యాలపై వివరించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు మల్కా రాంకిషన్ రావు మాట్లాడుతూ, బేగంపేట పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులను గతంలో మాదిరిగానే విమానంలో విశాఖపట్నం విహారయాత్రకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులకు ఉచిత రాను--పోను ఆటో సౌకర్యం, 10వ తరగతి విద్యార్థులకు రీడింగ్ కార్నర్ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు మల్కా రాంకిషన్ రావు, పద్మజ, శ్రీనివాస్, సంపత్ కుమార్, గీతారాణి, మంగ, శ్రీదేవి, స్వరూప, పీఈటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ సంతకం ఫోర్జరీ కేసులో నలుగురు అరెస్టు

**జగిత్యాల ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**




జగిత్యాల జిల్లాలో తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ముద్రలతో తప్పుడు ప్రభుత్వ పత్రాలు సృష్టించిన కేసులో నలుగురిని మెట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో రాజాల దేవి నర్రయ్య, కలికోట వేణు, లోలపు గణేష్, పాకాల రాకేష్ ఉన్నారు.పోలీసుల వివరాల ప్రకారం, మెట్‌పల్లి పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో ఉన్న సర్వే నంబర్--191 భూమికి సంబంధించి నకిలీ ఆబాది సర్టిఫికేట్ తయారు చేసి భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో మెట్‌పల్లి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ రబ్బరు స్టాంపులను ఉపయోగించినట్లు గుర్తించారు.నిందితుల వద్ద నుంచి కంప్యూటర్ పరికరాలు, నకిలీ రబ్బరు స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బెజ్జారపు మధుసూదన్, అంగడి శంకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ పత్రాలను ఫోర్జరీ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## అగ్ని ప్రమాద బాధితుని పరామర్శించి సహాయం హామీ ఇచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**అర్జున్ సమాచారం జూన్ 15 జగిత్యాల ప్రతినిధి ::**

జగిత్యాల పట్టణంలో మాజీ బజార్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదానికి గురి కావడంతో కాలిపోయిన ఇంటిని పరిశీలించి గంగాధర్ కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని, అదేర విధవడు అనిభరోషా ఇచ్చిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య గారు. వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ లు బోల్సాని శ్రీనివాస్, కూతురు రాజేష్, కూతురు శేఖర్, మెరు సేవా సంఘం అధ్యక్షులు వినోద్, కార్యదర్శి గట్ల శ్రీనివాస్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి: పోలీస్ కమిషనర్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**




ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని న్యాయ సంబంధిత వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా, రాజీ మార్గంలో పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు.రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక కేసులు, బ్యాంకు బకాయిల వసూళ్లు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాలను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. చిన్నచిన్న వివాదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది రాజీకి అనువైన కేసులను గుర్తించి, ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. తమ కేసుల్లో రాజీ కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని కోరారు.లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల సమ్మతితోనే రాజీ సాధ్యమవుతుందని, అక్కడ కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుందని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు, పోలీసు శాఖ, న్యాయస్థానాలు సమన్వయంతో పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించవచ్చని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.

## బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి: పోలీస్ కమిషనర్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 15**

బాధితుల నుంచి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు, ఫిర్యాదులను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.అందిన ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు



అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, మెరుగైన పోలీసు సేవలను అందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ నిరంతరం కృషి చేస్తోందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.




## వేసవి సెలవుల అనంతరం ఘనంగా పాఠశాల పునఃప్రారంభం



**అర్జున్ సమాచారం జూన్ 15 మంచిర్యాల:ప్రతిని.**

టేకుమట్ల, జూన్ 15: వేసవి సెలవుల అనంతరం సోమవారం టేకుమట్ల గ్రామంలోని పీఎం శ్రీ ఎం.పి.యూ.పి.ఎస్ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టేకుమట్ల గ్రామ సర్పంచ్ బల్ల వెంకటేష్ హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ బల్ల వెంకటేష్ సూచించారు.పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జైపూర్ మండలంలో అక్రమ మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**అర్జున్ సమాచారం జూన్ 15 మంచిర్యాల:ప్రతిని.**

మంచిర్యాల, జూన్ 15: చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని జైపూర్ మండలంలోని ఎల్కంటి, శట్‌పల్లి, కుందారం, నర్సింగాపూర్ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు ధర్మ సమాజ్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు రాకేష్ రేగుంట తెలిపారు.ఎల్కంటి గ్రామంలో చెరువు పూడిక మట్టి తొలగింపునకు అనుమతులు పొందిన వ్యక్తులు రైతులకు చెందాల్సిన మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ భారీగా లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. రైతుల అవసరాలకు వినియోగించాల్సిన మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు.చెరువులో మట్టి తవ్వకాలకు జూన్ 4 వరకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ, గడువు ముగిసిన తర్వాత కూడా అధికారుల దృష్టికి రాకుండా మట్టి రవాణా కొనసాగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ మట్టి తరలింపు



ఆగలేదని ఆరోపించారు.రైతులకు చెందాల్సిన సహజ వనరులను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న వారిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు రాకేష్ రేగుంటతో పాటు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జలంపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.